క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్థసారథి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికై కూటమి ప్రభుత్వంతో పోరాడుతూ, ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పని చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెం గ్రామానికి చెందిన మండల జెసీఎస్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గురజాల పార్థసారథి అన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చింతలపూడి వైస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు ఆధ్వర్యంలో తాడేపల్లిలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసినట్లు పార్థసారథి తెలిపారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ అండగా ఉందని తెలియజేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన పథకాలను అమలు చేయకుండా తప్పించుకుంటే ప్రశ్నించేలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పని చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేసినట్లు పార్థసారథి తెలిపారు.

కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండ



వైఎస్సార్‌సీపీ అధినేతతో నేట్రు గణేష్ యాదవ్

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వ చర్యలపై కార్యకర్తలు అధైర్యపడొద్దని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు జంగారెడ్డిగూడెం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు నేట్రు గణేష్‌యాదవ్ అన్నారు. బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గణేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచనలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారన్నారు.

భోజన వసతి



అన్నవసతి కల్పిస్తున్న డొక్కా సీతమ్మ సేవా సమితి సభ్యులు

జంగారెడ్డిగూడెం: సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థలోని వృద్ధులు, వికలాంగులకు బుధవారం డొక్కా సీతమ్మ సేవా సమితి సభ్యులు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణ, నిత్యాన్న దాత డొక్కా సీతమ్మ స్ఫూర్తితో బుట్టాయగూడెం రోడ్డులోని సీతామాలక్ష్మి సేవా సంస్థలో అన్నవసతి కల్పించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కేవీఆర్ సత్యనారాయణ, కొంచాడ దుర్గాప్రసాద్, రాధా మాధవ్ సత్య, మహాలక్ష్మి, సంస్థ నిర్వాహకులు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం




దాత చందుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,03,116 విరాళంగా అందజేశారు. నిడదవోలు మండలం సింగవరం గ్రామానికి చెందిన పెన్మెత్స చందు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మీడియాపై దాడి హేయం

జంగారెడ్డిగూడెం: మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి హేయమైన చర్య అని, తక్షణమే మోహన్‌బాబును అరెస్టు చేయాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డీవీ భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ రమణారావు, ఎం.గంగరాజు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా కోశాధికారి పి.రామకృష్ణ బుధవారం డిమాండ్ చేశారు.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్



- నీటి మూటలుగా ఎన్నికల హామీలు
- చంద్రబాబు మోసం మరోసారి బట్టబయలు
- హామీలు అమలు చేయాలంటున్న ప్రజలు

చింతలపూడి: అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ ద్వారా ఆరు పథకాలు అమలు చేస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చేలా కనిపించడం లేదు. చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ప్రభుత్వం నుంచి స్పష్టత రావడం లేదు. అధికారంలోకి వస్తే ఆరు పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లతో పాటు కూటమి నాయకులు ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందజేస్తామని చెప్పారు. అదే విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల నిరద్యోగ భృతి, 18 నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలకు నెలకు రూ.1500 మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ఊదరగొట్టారు. కూటమి నేతల మాటలు నమ్మిన ప్రజలు ఓట్లు వేసి కూటమి పార్టీలను గెలిపించారు. ఒక పక్క ఖరీఫ్ సీజన్ ముగిసిపోయి రబీ సీజన్ ప్రారంభం అవుతున్నా ఇంత వరకు రైతులకు అన్నదాత పథకం అమలు చేయలేదు. విద్యా సంవత్సరం కూడా మరో నాలుగు నెలల్లో ముగింపుకు వస్తున్నాయి తల్లికి వందనం పథకానికి దిక్కు లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు తీరు

అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గత ఐదేళ్లలో నూరు శాతం అమలు చేసి చూపించింది. చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కింద 45,313 మంది లబ్ధిదారులకు ఏటా రూ.61.17 కోట్లు పెట్టుబడి సాయం అందేది. అమ్మఒడి పథకం ద్వారా 28,966 మంది తల్లులకు ఏటా అమ్మఒడి సహాయం రూ.37.65 కోట్లు వారి ఖాతాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు.

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన ఆరు హామీల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినప్పటికీ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పోలవరం నియోజకవర్గంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై హామీలు ఇచ్చిన కూటమి నేతలు హామీలను గాలికి వదిలేసి కనీసం పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తై రబీ సీజన్ ప్రారంభం అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా తల్లికి వందనం పథకం అమలు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. అలాగే తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం. అని పదే పదే చెప్పిన పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో చార్జీలను పెంచడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలి. పరిపాలన చేపట్టి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. ఎన్నికల సమయంలో రైతులకు ప్రతి ఏడాది పెట్టుబడి సాయం రూ.20 వేల చొప్పున ఇస్తానని రైతులను మోసం చేశారు.

సాయిన కనకరాజు, రైతు కామవరపుకోట మండలం

పరిహారం అందించాలి



గ్రామస్తులను ఒక వీధి తేడాతో ఏ, బీ బ్లాకులుగా పెట్టి వాటిని 41 కాంటూరు, 45 కాంటూరుగా విభజించి అందరికీ పరిహారం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తుంది. మొత్తం గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్‌అండ్ఆర్ పరిహారం చెల్లించాలి.

సూర్ల రాము నిర్వాసితుడు, రామసింగారం, కుక్కునూరు మండలం

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చింది. ప్రస్తుతం ట్రూఅప్ చార్జీల పేరుతో పేదలపై భారం మోపుతుంది. ఇది చాలా దుర్మార్గమైన చర్య. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయం మంచిది కాదు.

రామ్మోహన్‌రావు, ఐఎఫ్‌టీయూ నాయకులు, బుట్టాయగూడెం

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

లింగపాలెం: రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నజీ మొల్లషా రైతులకు, ప్రజలకు సూచించారు. ములగలంపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జేడీఈ జయప్రకాష్ మాట్లాడుతూ గ్రామంలోని రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందని తెలిపారు. దీంట్లో సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇనుగంటి రాజేష్ బాబు, ఇనుగంటి సుధీర్‌బాబు ఎండోమెంట్ మండల ఇన్‌చార్జి సీహెచ్ చిన్న నాగేశ్వరరావు, వీఆర్వో అనిత, వీఆర్ఏ బాబూరావు, బొల్లిన పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ సమస్య పరిష్కరించాలి

చింతలపూడి: మండలంలోని మద్దిమత్తినగూడెం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో గ్రామస్తులు చెరువుల ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్ర స్థాయిలో ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ప్రమద్వర, సర్పంచ్ కె.రాంబాబు, ఎంపీటీసీ ప్రసాద్, పి.నర్సారెడ్డి వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మీభూమి–మీహక్కు

కొయ్యలగూడెం: మీభూమి–మీహక్కు రెవెన్యూ సదస్సుల ద్వారా అర్హులైన వ్యక్తులకు న్యాయం జరుగుతుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. బుధవారం కన్నాపురంలో తహసీల్దార్ చెల్లన్నదొర ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ఆర్డీఓ ఎంవీ రమణతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీ అభివృద్ధి కోసం, మీ సంక్షేమ కోసం, మీ రక్షణ కోసం ప్రభుత్వం శ్రమిస్తోందని తెలియజేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.పద్మావతి, ఎంపీటీసీ ఎస్‌కే బాజీ, జ్యేష్ఠ రామకృష్ణ, తోట రవి, బి.నిర్మల కిషోర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి: ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న అధికారులు



కొయ్యలగూడెం: అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

పుంత రోడ్ల సమస్యలను పరిష్కరించాలి

బుట్టాయగూడెం: మండలంలోని అంతర్వేదిగూడెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న పలువురు రైతులు తమ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పుంతరోడ్ల సమస్యలు అధికంగా ఉన్నాయని తహసీల్దార్ పీవీ చలపతిరావుకు విన్నవించుకున్నారు. సరిహద్దులు సక్రమంగా లేక తరచూ వివాదాలు తలెత్తుతున్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజులు, మాజీ సర్పంచ్ కొమరం మల్లేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రైతులను ముంచిన కూటమి ప్రభుత్వం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం రైతులను నమ్మించి, నిండా ముంచిందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా విమర్శించారు. మండలంలోని దుద్దుకూరులో బుధవారం ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ నిరసన గళం పోస్టర్లను బాలరాజుతోపాటు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఉచిత పంటల భీమాకు ఈ ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు సాగు చేసే సమయానికి రైతు భరోసా పథకంలో నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు చెల్లించేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 40570 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా సుమారు రూ.93.33 కోట్లు జమ చేశారన్నారు. అలాగే రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. అయితే ఈ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలను కూటమి నేతలు ప్రజలకు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఆ హామీలను అమలు చెయ్యకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. అలాగే రైతులు ఈ నెల 13వ తేదీన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన గళం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, తెల్లం చిన్నారావు, కాలింగి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

వేలేరుపాడు: పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ జనవరి ఆరో తేదీన కోట రామచంద్రపురం ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్‌కే గౌస్ తెలిపారు. బుధవారం కోయ మాధవరం, మేడిపల్లి, అల్లూరినగర్ గ్రామాల్లో సీపీఐ గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ జనవరి ఆరో తేదీన ఐటీడీఏ వద్ద ధర్నా, పోలవరం ఆర్‌అండ్ఆర్, నిర్వాసితుల సమస్యలపై జనవరి రెండో వారంలో జీలుగుమిల్లిలో జిల్లాస్థాయి సదస్సును నిర్వహించనున్నామని, ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, పోలవరం డివిజన్ పార్టీ కార్యదర్శి కట్టం ముత్యాలరావు, మేడిపల్లి సర్పంచ్, వేలేరుపాడు సీపీఐ మండల కార్యదర్శి కట్టం రాంబాబు, మేడిపల్లి ఎంపీటీసీ తుర్రం తమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే గౌస్

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ఎక్సైజ్ అధికారులు చింతలపూడి సర్కిల్ పరిధిలో బుధవారం దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెంలో నిర్వహించిన దాడుల్లో దేశావతు లక్ష్మి అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. సారా విక్రయానికి పాల్పడుతున్న దేశావతు నాగేశ్వరరావు పరారయ్యాడన్నారు. ఆడమిల్లికి చెందిన నిందితుడు వేముల గంగయ్యను కామవరపుకోట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. వల్లంపట్ల గ్రామానికి చెందిన పరారీ కేసులో నిందితులైన బాలిన నాగలక్ష్మిని అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు హాజరు పరిచామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న నిందితురాలు, సామాగ్రితో ఎక్సైజ్ అధికారులు

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెం సమీపంలో చెరువు వద్ద ఉన్న సారా తయారీ కేంద్రంపై పోలవరం ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి ఉపయోగించే సుమారు 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంతో ఈ దాడులు చేశామన్నారు. సారా తయారీకి సంబంధించి కేసు కూడా నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై జి.సునీల్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ అధికారులు బుధవారం మండలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మైసన్నగూడెంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. అలాగే ఒక లీటరు సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



ముద్దప్పగూడెం శివారు చెరువు దగ్గర బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

వృద్ధ దంపతులకు 'మానవత' సహాయం

జంగారెడ్డిగూడెం: రాజుల కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులకు మానవత ఆధ్వర్యంలో బుధవారం సహాయాన్ని అందించారు. వృద్ధ దంపతులు చిటికెలు సత్యనారాయణ, సీతమ్మ ఇస్త్రీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వయోభారంతో సత్యనారాయణ కాలికి ఇన్ఫెక్షన్ సోకడంతో నిలబడలేని స్థితిలో వారి జీవనం దుర్భరంగా మారింది. విషయం తెలుసుకున్న మానవత సభ్యులు వృద్ధులకు సంస్థ తరపున రూ.5650 విలువ చేసే గ్యాస్ కనెక్షన్, సిలిండర్, పొయ్యి అందజేశారు. అలాగే వారికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మానవతాల మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, మండల సెక్రెటరీ గద్దె సత్యనారాయణ, ట్రెజరర్ ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, శంకర్రావు, అనన్య డైరెక్టర్ బి.ప్రసాద్ రాజు పాల్గొన్నారు.



వృద్ధులకు సహాయాన్ని అందజేస్తున్న మానవత సభ్యులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు: పాతముప్పర్రులో సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వై రాంబాబు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

14 వరకు ప్రత్యేక వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈ నెల 11న ప్రారంభమైన ప్రత్యేక వైద్య శిబిరం 14 వరకు కొనసాగుతుందని ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఈ శిబిరంలో అమెరికాకు చెందిన వైద్యులు శ్రీనాథ్ కామినేని రోగులకు సేవలందిస్తారని చెప్పారు. ముఖ్యంగా భుజం, మోచేయి, తుంటి, మోకాలు సమస్యలు ఉన్న వారికి అత్యాధునిక వైద్య చికిత్స అందిస్తారన్నారు. వైద్య ఖర్చులు భరించలేని రోగులకు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థల సాయంతో చేయూత ఇస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 83744 45108, 79016 95176 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అదుపుతప్పి గోతిలో పడిన కారు



గుంతలోకి దూసుకుపోయిన కారు

బుట్టాయగూడెం: కారు అదుపుతప్పి గోతిలోకి వెళ్లిన సంఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడేనికి చెందిన జల్లిపల్లి సత్యనారాయణ, తల్లి సత్యవతి, కొడుకు ఆనంద్ జంగారెడ్డిగూడెం నుంచి వారి స్వగ్రామానికి కారులో వెళుతుండగా మర్లగూడెం సమీపంలో కారు అదుపు తప్పి గోతిలోకి వెళ్లింది. ఈ సంఘటనలో వారి ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. తెలిసిన కొందరు వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు.

జిల్లా మహా సభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: సీపీఎం ఏలూరు జిల్లా 26వ మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించి, అనంతరం జీవరత్నం మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఎనలేని పోరాటాలు చేస్తుందన్నారు. నిత్యావసరాలు పెరుగుదల, ఉపాధి హామీ, పోడు భూములు తదితర సమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లా 26వ మహాసభలు బుట్టాయగూడెం మండలంలో డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో నిర్వహిస్తామని, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు జి.సూర్య కిరణ్, యు.సత్యనారాయణ, వంగా గోపి, శివయ్య, రెడ్డి ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.